
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# రచయిత, దర్శకుడు - వీటూరి

## (విజయచిత్ర 1974, సెప్టెంబర్ సంచిక నుంచీ)



ఉత్సాహవంతులకూ, సినిమాలకూ మధ్య 'వారధి' లాంటిది నాటకం. చలన చిత్రానికి తొలిదశ నాటకమే కాబట్టి, చలనచిత్ర ప్రవేశానికి, నేటికీ నాటకం 'వారధి' లాగానే నిల్చున్నది. నాటకాల ద్వారా ఎందరో నటులు, నటీమణులు, రచయితలు, సంగీత దర్శకులు సినిమాలకు వచ్చినట్టే  వీటూరీ వచ్చారు. చిన్ననాడు ఆయనకు నాటకాల మీద ఉత్సాహమే గనక లేకపోయినట్టయితే, తర్వాత తర్వాత సినిమాల మీద కూడా ఉత్సాహం వుండేది కాదేమో! విజయనగరంలో వీటూరి చదువుకుంటున్నప్పుడు రచన మీద ఉత్సాహం కలిగింది. తండ్రిగారు జ్యోతిషంలో పెద్ద పండితులు. ఆయన ద్వారానూ, దగ్గర బంధువైన యామిజాల పద్మనాభస్వామి గారి ద్వారానూ వీటూరిలో కవితాంకురం జరిగింది.  స్వయంకృషితో తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించుకున్నాడు. పన్నెండో ఏటే అతను కవిత్వం రాశాడు. వీటూరికి ఇంకో ఉత్సాహం కూడా ఉండేది. అది హార్మోనియం వాయిస్తూ పాటలు పాడడం. ఆ ఉత్సాహం, ఈ ఉత్సాహం కలిసి అతని చేత నాటకాలు రాయించాయి. పగ, కరుణాశ్రమం, కల్పన, ఆరాధన, చంద్రిక మొదలైన నాటకాలు రాశారు వీటూరి. ఆయనే సొంతంగా నాటక సంస్థ నెలకొల్పి, ఆ నాటకాలు ఆడారు. ఆ సమయంలోనే విజయనగరంలో వీటూరికి సన్మాన సభ జరిగింది. 'తరుణ కవి' అని వీటూరికి బిరుదు ఇచ్చారు.

వీటూరి. వీటూరి ఇంటిపేరు. వెంకట సత్య సూర్యనారాయణమూర్తి వీటూరి పేరు. ఈ పేరుతో కాకుండా, 'జ్యోతిర్మయి' 'జ్యోతి కుమార్' 'వీటూరి' అన్నపేర్లతో ఆయన అప్పట్లో ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ మొదలైన పత్రికల్లో కథలు రాశారు.

వీటూరి ఉత్సాహం చలనచిత్రాల మీదకు మళ్ళింది. పరిశ్రమలో వున్న అవకాశం అతనికోసం ఎదురు చూడసాగింది. 'అక్కచెల్లెలు' చిత్రం దర్శకులలో ఒకరైన సార్వభౌమారావుది ఆ ప్రాంతమే. భీమునిపట్నంలో ఆయన వీటూరి నాటకం ఒకటి చూశారు. ఆ నాటకం ఆ ఇద్దర్నీ కలిపింది. వీటూరిలో వున్న ఉత్సాహాన్ని, ప్రజ్ఞనూ చూసి అతన్ని సినిమా రచయితగా పరిచయం చెయ్యాలనుకున్నారు సార్వ భౌమారావు. ఆ ఊహకు రెక్కలొచ్చాయి. ఆ రెక్కలు కట్టుకుని 1958లో వీటూరి మద్రాసులో వాలారు. అయితే అనుకున్నట్టుగా సార్వభౌమారావు చిత్ర నిర్మాణం ఆరంభం కాలేదు. జరుగుతున్న ఆలస్యాన్ని చూసి, ఆయనే వీటూరిని చాలామంది పెద్దలకు పరిచయం చేశారు. సదాశివబ్రహ్మం, పాలగుమ్మి పద్మరాజుగార్ల దగ్గర వీటూరి లవకుశ, ఇంటిగుట్లు, కృష్ణలీలలు, భక్తశబరి చిత్రాలకు సహాయకుడిగా పని చేసి, సినిమా స్క్రిప్టు దానికి సంబంధించిన విషయాలు తెలుసుకున్నాడు. 'భక్త శబరి' లో కొన్ని పాటలు, పద్యాలూ రాసే అవకాశం లభించింది. ఆతర్వాత హెచ్. యమ్. రెడ్డిగారితో పరిచయం కలగడం; వీటూరిని ఆయన, రచయతగా నియమించడం; 'గజదొంగ' చిత్రానికి వీటూరి మాటలు రాయడం జరిగాయి.

అంతకు ముందు వీటూరికి మరో మంచి అనుభవం కూడా కలిగింది. రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ తరపున పద్మనాభం 'శాంతి నివాసం' నాటకం తీసుకున్నారు. వీటూరి అందులో పాటలు రాశారు. అంతేకాకుండా, ఆ బృందంతో వూరూరూ వెళ్ళి, నిర్వహణ శాఖలో పాల్గొన్నారు. ఆ తర్వాత కొన్ని డబ్బింగ్ చిత్రాల్లో పాటలు రాసే అవకాశం కూడా కలిగింది.

వీటూరికి కలిగిన తొలి పూర్తి అవకాశం"స్వర్ణగౌరి" చిత్రంతో, వై.ఆర్.స్వామి తీసిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు వీటూరి రాశారు. తర్వాత నిర్మాత భావనారాయణగారు వీటూరిని బాగా ప్రోత్సహించారు. అలాగే విఠలాచార్య గారూ. ఈ ప్రముఖులిద్దరూ చూపిన ఆదరణే తనను పరిశ్రమలో రచయితగా నిలబెట్టిందని వీటూరి ఎప్పుడూ కృతజ్ఞతలతో చెప్పకుంటూనే వుంటారు. అలాగే పద్మనాభం. వీటూరి రాసిన తొలి సాంఘిక చిత్రం రేఖా అండ్ మురళీ వారి 'దేవత'.

ఇంతవరకూ వీటూరి 42 చిత్రాలకు రచన చేశారు. వీటిల్లో ఎక్కువ చిత్రాలు జానపదాలు. ఇవి కాకుండా కొన్ని డబ్బింగ్ చిత్రాలకు కూడా మాటలు, పాటలు రాశారు. ఇవి కాకుండా, విడిగా పాటలు మాత్రమే రాసినవి కూడా చాలా వున్నాయి.

ఆకాశరామన్న, చిక్కడు దొరకడు, మర్యాద రామన్న, తోటలో పిల్ల కోటలో రాణి, బంగారు తిమ్మరాజు, శ్రీమతి, లోగుట్టు పెరుమాళ్ళకెరుక, ఇద్దరు మొనగాళ్ళు, మల్లమ్మ కథ, భక్త తుకారాం, గుండెలు తీసిన మొనగాడు – మొదలైన చిత్రాలు వీటూరి రాసిన చిత్రాల్లో కొన్ని చిత్రాలు. 'భక్త తుకారాం' లో మాటలే కాకుండా, కొన్ని పాటలు, పద్యాలూ కూడా రాశారు.

విజయలలిత పిక్చర్స్ పేరిట వీటూరి సొంతంగా సంస్థ ఆరంభించి 'అదృష్ట దేవత' జానపద చిత్రాన్ని నిర్మించారు. దాంతో చిత్రనిర్మాణంలో వున్న సాధకబాధకాలు బాగా అర్థమయినై. ఆ శాఖలో అనుభవం తక్కువ కావడంతో కొన్ని ఇబ్బందులకు గురయ్యారు.

వీటూరికి దర్శకత్వశాఖలో కూడా అనుభవం వున్నది. భావనారాయణగారి చిత్రాలకు రచన చేసినప్పుడు దర్శకత్వశాఖలో ఆయన సెట్సు మీద కూడా పని చేసేవారు. చాలా చిత్రాలకు పని చెయ్యడంతో ఆ శాఖతో కూడా మంచి పరిచయం, అందులో అనుభవం కలిగాయి.

వీటూరి తయారు చేసిన ఎన్నో కథల్లో 'భారతి' కథ కూడా ఒకటి. ఈ కథను తానే చిత్రంగా తీసుకుని తన వూహలకు తానే రూపకల్పన చేసుకోవచ్చునని తానే డైరక్టు చెయ్యాలనుకున్నారు. మనోరంజని పిక్చర్స్ వారు ఈ కథను విన్నప్పుడు వీటూరి వూహ కూడా విని 'అయితే మీరే దర్శకత్వం కూడా వహించండి' అన్నారు. ఆ అవకాశంతో వీటూరి దర్శకుడు కూడా అయినారు. 'భారతి' చిత్రానికి కథకుడు, మాటలు, పాటల రచయిత, దర్శకుడూ వీటూరి.

ఈ చిత్ర నిర్మాణం పూర్తయింది; త్వరలోనే విడుదల కానున్నది. రామలక్ష్మి పిక్చర్స్ అనే కొత్త సంస్థ పేరిట వీటూరి ఒక కొత్త తరహా చిత్రం తియ్యబోతున్నారు; ఆయనే దర్శకత్వం కూడా వహిస్తారు.

"నేను దర్శకుడిని కూడా కావడం కేవలం కాకతాళీయం. నా మీద సంపూర్ణమైన విశ్వాసంతో ఆ బాధ్యతను నాకు వప్పజెప్పిన మనోరంజని పిక్చర్స్ కె.వి.రెడ్డిగారికి, తక్కిన భాగస్తులకు, పంపిణీదారులకూ నేను ఎప్పుడూ కృతజ్ఞుడను.

తొలిసారిగా నేను దర్శకత్వం చేపట్టినా  నేను అనుకున్నది తియ్యగలిగానన్న తృప్తి కలిగింది. దర్శకత్వం వహించగలనన్న విశ్వాసం ఏర్పడింది. ఇక ముందు దర్శకుడిగా కూడా స్థిరపడాలన్న వాంఛను కలగజేసింది;

నా దృష్టిలో చిత్ర దర్శకుడికీ, రచయితకూ పెద్ద తేడా లేదు. ఇద్దరూ ఒకటే. రచయిత కాగితం మీద రాస్తాడు; దర్శకుడు తెర మీద చెబుతాడు. ఇద్దరూ రచయతలే. అయితే రచయితే దర్శకుడు అయినా, దర్శకుడే రచయిత అయినా నా ఉద్దేశంలో – కొన్ని లాభాలున్నాయి. రచయితగా తాను ఉద్దేశించినదాన్ని, సవ్యంగా ఆచరణలో పెట్టగలగడానికి ఆస్కారం వుంటుంది. దీనివల్ల కొందరు ఒక మాట అంటూ వుంటారు. దర్శకుడు, రచయిత– ఇద్దరూ వేర్వేరు వ్యక్తులు కాబట్టి రెండు మేధస్సులు కలుస్తాయి ఒకడే రెండూ చేపడితే, ఒక మేధస్సు తగ్గిపోదా – అని. ఇందులో కొంత నిజమూ వుంది; కొంత ఇబ్బందీ వుంది. దర్శకుడు సమర్ధుడయితే రచయిత భావాలను మరింత రాణింపజేయ గలుగుతాడు; లేకపోతే అంతా మారిపోవచ్చు. రెండు మేధలు తగ్గిపోయి, ఒక్కటి అయిపోయినా, చర్చించడానికి, నిర్ణయాలు చెయ్యడానికీ తక్కిన వాళ్ళు ఉండనే వుంటారు. ఏమైనా – పరస్పర అవగాహన, ఏకీభావం తగ్గిపోయిన ఇవాళ్టి రోజుల్లో దర్శకుడు, రచయిత ఒకరే అయితేనే నయమేమో అనిపిస్తుంది." అన్నారు వీటూరి.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS